# పూలరథం వాడి పోయింది

వీధి కిటికీ దగ్గర కుర్చీలో కూర్చుని అరిచేతిలో గడ్డాన్ని ఆన్చుకుని బయటికి చూస్తున్న స్వర్ణలత చటుక్కున తల తిప్పి అంది. "ఓ మంచి స్కై బ్లూ కలర్ టెర్లిన్ చీర కట్టుకుని, చక్కటి రెండు పేటల మంచి ముత్యాల దండ వేసుకుని, చేతికి వాచీ, చెవులకు పొళ్ల రింగులతో బృందావన్ గార్డెన్స్‌లో ఫౌంటెన్ ముందు కూర్చుని ఆకాశం చూడాలని ఉంది!" అంత వరకూ ఫెళ్లున ఎండకాసిన ఆరోజు సాయంత్రం ఆరు గంటల సమయంలో తేలి తేలి వస్తూన్న మబ్బుతునకలతో, చల్లగా, అహ్లాదకరంగా తయారయింది. చిరుగాలి తెరలు లతలాటి అమ్మాయిలకు గిలిగింతలు పెట్టి పోతున్నాయి. ఎదురింటివారి పందిరిలో విరగబూసిన విరజాజుల మత్తు పరిమళాన్ని మెల్లగా మోసుకువచ్చి ఆ అమ్మాయి ప్రశాంతమైన మనస్సులో ఏదో తెలియని భావాలను రేకెత్తించి, నుదుట నడయాడే ముంగురులను సవరించి చక్కా పోతున్నాయి కొంటె గాలులు.

"ఇంకేం? అమ్మాయిగారు మంచి రసవత్తర ఘట్టంలో పడుతున్నారు. ఇహ ఊరుకుంటే లాభం లేదు!" ఆయనగారి ఉత్తరం నాలుగోసారి చదువుకుంటున్న చిన్నక్క సరోజ కొంటెగా కళ్లు ఎగరేస్తూ అని అక్క వైపు చూసింది.

"అంతటితో ఆపేశావేం అమ్మడూ? నువ్వు అలా అలా ఊహల్లో తేలిపోతూ ఆకాశం అందాన్ని చూస్తూంటే, నీ ఆరమోడ్పు కన్నుల అందాన్ని చూపులతోటే ఆస్వాదిస్తూ పరవశించే ఓ జతగాడూ..." పెద్ద కూతురికి జడవేస్తూ చెల్లెలిని అల్లరి పట్టిస్తున్న పెద్దక్క లలిత, స్వర్ణ మూతి ముడుచుకోవడంతో ఆపేసి నవ్వింది తమాషాగా! సరోజ మాత్రం వదిలిపెట్టలేదు. ఒక పట్టాన, 'ఆ జతగాడూ మరోలా ఉండకూడదేవ్! పొడుగ్గా, బలంగా, ఠీవిగా ఓ చేతిమీద కోటు పడేసుకుని... హీరోలా...."

ఎంత వద్దనుకున్నా కళ్లలో తొంగి చూస్తున్న మెరుపులతో, చెక్కిళ్లు రాగరంజితం కాగా చప్పున కుర్చీలోంచి లేస్తూ, "ఆ! మరేం! అతడి పేరు మూడు వంతులు శేఖర్ అయితే మరీ బావుంటుంది... ఛ ఛ ఛ! అన్నీ సినిమా డైలాగులూ... కథా ప్రపంచాలూనూ..." ఉక్రోషంగా అంటూ పెదిమలు బిగించి వస్తున్న చిరునవ్వు దాచుకుంటూ అక్కడినుండి చివాలున వెళ్లిపోయింది పద్దెనిమిదేళ్ల కన్నెపిల్ల స్వర్ణలత! ఆ అమ్మాయి అవస్థ చూసి అనుభవంగల అక్కలిద్దరూ భావగర్భితంగా ఒకరిని ఒకరు చూసుకుని పకాలున నవ్వుకున్నారు.

విసురుగా వచ్చి తోటలో సిమెంటు బెంచీమీద కూలబడిన లతకు గాలికి ఊగుతున్న గులాబులూ, అప్పుడప్పుడే విచ్చి సౌరభాల్ని వెదజల్లుతున్న నైట్ క్వీన్లూ స్వాగతం పలికాయి. ఆహ్లాదకరమైన ఆ వాతావరణంలో, తీరికగా కూర్చుని నక్షత్రాలు లెక్కపెడుతున్న స్వర్ణ మనసు అంతకుముందు జరిగిన సంభాషణలు గుర్తుకు తెచ్చుకోసాగింది. పక్కకు నెట్టి వేద్దామని ప్రయత్నించినా, "కథ, సినిమా డైలాగులు" అని హేళనగా పైకి అన్నా ఆ మాటలే పదే పదే తలుచుకుని మధురమైన ఊహలతో విహరించసాగింది ఆ ముగ్ధ! అంతరంగాన్ని అణగదొక్కడం ఎవరికి సాధ్యం? అందులోనూ కలలలో తేలిపోయే ఆ వయస్సులో!

"అమ్మా, నీకెప్పుడూ పైన డాబామీద వెన్నెలలో కూర్చోవాలనిపించదా? ఎంత పెద్ద చంద్రుడు వచ్చాడనీ! ఈవేళ పౌర్ణమా, అమ్మా?"

మిలమిలా మెరుస్తున్న కూతురు కళ్లలోకి చూస్తూ నెమ్మదిగా నవ్వింది సావిత్రమ్మ! "ఇదా నువ్వు చేస్తున్న పని? రెండు గంటల నుండి పిలుస్తున్నా రాలేదు భోజనానికి ఎందుకే అంటే... చందమామ కబుర్లు చెబుతావు వచ్చి?"

ఊహూ! స్వర్ణలత ఉత్సాహం అంతటితో ఆగిపోలేదు. "కాదమ్మా! పై మేడమీద పిట్టగోడమీద పడుకుని అలా ఆకాశంలోకి చూస్తూంటే అబ్బ! ఎన్ని యుగాలయినా అలా ఉండిపోవాలని ఉంది. నిర్మలంగా ఉండే నీలాకాశంలో దూది పింజెల్లా తేలివచ్చే మబ్బు తునకల మధ్య, మెరిసిపోయే తారకలతో దాగుడుమూతలాడుతున్నట్టు చందమామ పరిగెత్తుకు పోతూంటే వెంటే నేనూ పోవాలనేంత సరదా వేస్తుంది తెలుసా? అయినా చంద్రుడికి అంత చక్కటి కాంతి, వెన్నెల కంత చల్లటి గుణం ఎవరిచ్చారో? అందులోనూ నిండుపూర్ణిమనాడు.

అమ్మాయి ధోరణికి అంతం లేకపోవడంతో తానే అడ్డుకుంది అమ్మ. "అందుకేనే పిచ్చీ! ఈ బంగారు బొమ్మకు ఓ చందమామలాటి కుర్రవాణ్ణి చూడమని మీ నాన్నగారితో రోజూ చెబుతున్నాను! ఊరికే వెన్నెలనూ, సన్నజాజులనూ చూసి పరవశిస్తూంది మన లత – ఈ వెన్నెట్లో, ఆ సన్నజాజులు ముడుచుకుని చెయ్యీ చెయ్యీ కలిపి వెన్నెల విహారం చేయడానికి....

"చాలు బాబోయ్! చాలు." రెండు చెవులూ మూసుకుంటూ బుంగ మొహం పెట్టి గట్టిగా అరిచి పారిపోయింది స్వర్ణలత! అక్కడి నుండి పారిపోయినా అమ్మ మాటలు వెన్నంటి వస్తూ స్వర్ణను నిద్రపోనీయలేదు ఆ రాత్రి! తియ్యటి కలలూ... మధురమైన ఊహలూ, ఏవేవో భావాలూ... అన్నీ చుట్టుముట్టి మెత్తగా వేధించాయి ఆ కన్నె మనసును.

బంగారు కిరణాలతో మృదువుగా తట్టి లేపాడు బాల భానుడు. ఉలికిపడి లేచికూర్చుంది స్వర్ణ. అప్పుడే తెల్లగా తెల్లవారిపోయింది. లేచి బ్రష్ తీసుకుని పెరట్లోకి వచ్చిన స్వర్ణలత అలాగే నిలబడిపోయింది. పౌర్ణమి చంద్రుడు వదిలి వెళ్లిన వెన్నెల జల్లులన్నట్లు కింద అంతా ఒత్తుగా రాలి భూమిని కప్పివేసి పరుచుకుని ఉన్నాయి విరిసి రాలిపోయిన పారిజాతాలు. ప్రభాత గీతిక ఆలాపిస్తూ పరామర్శించే పిల్లగాలి అల్లరికి నవ్వుతూ ఉయ్యాల లూగుతున్నాయి మల్లెపూలు. ఎత్తు చూసి భయపడి నన్ను వదిలివెయ్యక! అని హెచ్చరిస్తూ స్వర్ణ తల తాకుతూ హెచ్చరించింది సంపెంగ!

'త్వరగా మొహం కడుక్కుని రావే, లతా!" వంట ఇంట్లో నుండి తల్లి పిలవడంతో గబగబ దంత ధావన ముగించి లోపలికి వచ్చి కాఫీ కప్పు తీసుకుని హాల్లోకి వచ్చి కూర్చుంది స్వర్ణ. ఆలస్యంగా నిద్ర పట్టడంవల్ల కళ్లు భారంగా వాలిపోతున్నాయి. "కలలు నిదురవోవు కనుబొమ్మలు!" బాపిరాజుగారి వర్ణనను అందుకుంది సరోజ. అక్క పరిహాసానికి చిరుకోపం చూపబోయిన అమ్మాయి కళ్లు అలా ఆలోచనలోపడి మనస్సును ఎక్కడికో లాక్కుపోయాయి. ఎక్కడో దూరం నుండి లీలగా వినబడుతూంది ఘంటసాల విషాద భరితమైన గొంతు. "మనసున మనసై బ్రతుకున బ్రతుకై..." అలా శూన్యంలోకి చూస్తూండి పోయిన స్వర్ణ కళ్లలో అప్రయత్నంగా నీళ్లు తిరిగాయి. "నీ కోసమె కన్నీరు నించుటకు... నీ వ్యథ తెలిసి నీడగ నిలిచే తోడొక రుండిన అదే భాగ్యమూ అదె స్వర్గమూ..." విషాదానికి మారుపేరుగా పలికిన ఆ గొంతు ఆగిపోయింది. చెమర్చిన కళ్లు పైటతో ఒత్తుకుని కాఫీ అలాగే విడిచిపెట్టి లేచింది స్వర్ణ.

"అమ్మా! చప్పున ఇలా రావాలి!" గావుకేక పెట్టింది సరోజ. ఏమిటో అన్నట్టు వంటఇంట్లో నించి హడావిడిగా వచ్చారు సావిత్రమ్మా, లలితా. గిర్రున వెనుదిరిగిన స్వర్ణ మామూలుగా నవ్వేస్తూ, "కొంపదీసి అర్జెంటుగా అనుమానం వచ్చిందా ఏమిటి. అక్కా, పుట్టబోయేది అమ్మాయా అబ్బాయా అని?" అంది.

కాని, సరోజ అదేం వినిపించుకోలేదు. "అమ్మా! లతకు చప్పున ఒక తోడు చూస్తావా, లేదా?"

తెల్లబోయారు అమ్మా అక్కా! స్వర్ణకూ అదేమిటో అర్థంకాలేదు. సరోజ గంభీరంగా వివరించింది. "మన అమ్మడు 'మనసున మనసై బ్రతుకున బ్రతుకయ్యే తోడొకరు లేరని పొద్దున్నే కళ్లనీళ్ళు పెట్టుకుంది! కావలిస్తే దాని కళ్లు చూడు..." సావిత్రమ్మా, లలితా స్వర్ణకేసి చూశారు నిజమా అన్నట్టు. సిగ్గూ కోపం కలిసికట్టుగా రాగా కళ్ళు దించివేసుకుంది స్వర్ణలత. "సిగ్గు పడుతూంది కూడాను, చూశారా?" సరోజ చప్పట్లు కొట్టి నవ్వింది. "ఊఁ! ఆ పనిలోనే ఉన్నాం మేమూనూ..." సావిత్రమ్మ నవ్వుతూ అనేసి లోపలికి వెళ్లింది. అర్థంకాక ఆశ్చర్యంగా తలెత్తి చూస్తున్న చెల్లెలికి ఓ కొంటెనవ్వు విసిరి తాను లోపలికి చక్కా పోయింది లలిత.

లత జమీందార్ల అమ్మాయేం కాదు. సామాన్య మధ్య తరగతికి చెందిన కుటుంబంలో అమ్మాయే. పి.యు.సి. పాసై చదువు మానేసింది సాధారణమైన అందగత్తె. చదవాలనే ఆకాంక్ష ఉన్నా ఆర్థికమయిన ఇబ్బందులవల్ల సాగలేదు. కలలను కొని తెచ్చే వయస్సూ, సై తోడులుగా ఆత్మీయుల పరిహాసాలూ, పూల రథంలా గాలిలో తేలిపోయే కన్నె మనసూ, ఆ అమ్మాయి భావిని గురించీ, జీవిత మధురిమను గురించీ, తన సహచరుణ్ణి గురించీ మధురమైన కలలు కనేటట్టు ప్రోత్సాహం ఇచ్చాయి.

వంటఇంట్లోంచి కమ్మ కమ్మటి వాసనలు తేలి వస్తూండగా అప్పుడే మధ్యాహ్నం నిద్ర ముగించిన లత హడావిడిగా పరిగెత్తుకు వచ్చింది వంట ఇంటికి. వెండి పళ్లాలలో మైసూరుపాకులూ, కాలాజామ్‌లూ నోరు ఊరిస్తున్నాయి. గారం గుడిచి, అమ్మను అడగడానికి అడుగు ముందుకు వేసింది స్వర్ణ. కూతుర్ని చూడగానే కంగారు పెట్టేసింది వాళ్లమ్మ. "నడు నడు! చప్పున మొహం

కడుక్కుని చీరె మార్చు!" స్వర్ణ తెల్లబోయింది. ఎందుకూ ఏమిటీ అని అడగబోయేంతలో హాల్లోనించి తండ్రి గొంతు, "వాళ్లు వచ్చేశారు! అమ్మాయిని లేపు త్వరగా!" అంటూ హెచ్చరించింది. హడిలిపోతూ బాత్ రూముకు పరుగెత్తింది. ఎదురుగా హాల్లో కూర్చున్న అతగాడి కేసి ఒకే ఒకసారి కళ్లెత్తి చూసింది స్వర్ణలత. సన్నగా, ఛామన ఛాయలో ఉన్నాడతను. మరుక్షణంలో కళ్లు వాల్చి వేసుకుంది. "పొడుగ్గా, బలంగా, .... శేఖరం!" స్వర్ణ మనసు వికలమయింది తరవాత ఏ విషయము ఆ అమ్మాయిని ఎవరూ అడగలేదు. అబ్బాయి లక్షణంగా ఉన్నాడనుకున్నారు అమ్మా నాన్నలు, ముహూర్తం పెట్టేశారు! స్వర్ణలత పెళ్ళి అయిపోయింది.

"ఆహా! తొలి దీపావళికి అల్లుడికి ఎంత పెద్ద బహుమతి!" ఆఫీసుకు తయారవుతూ ప్యాంటు తొడుక్కొంటున్న మూర్తి హేళనగా అన్నాడు, షర్ట్ అందిస్తున్న స్వర్ణలత మనసు ఒక్కసారి చిన్నగా మూలిగింది. "ఈసారి డైమండ్ రింగ్ ఇస్తేనే కానీ...' మూర్తి మాటలు అస్పష్టంగా వినబడుతున్నాయి ఆమెకు. విశాల దృక్పథంతో, ఆశయాలు ఆచరణలో పెట్టే ఒక రూపు ఆమె హృదయంలోంచి నెమ్మదిగా చెరిగిపోతూంది.

ప్రశాంతమైన సాయంత్రం, ఇంటికి వచ్చిన మూర్తికి ప్రఫుల్ల వదనంతో కాఫీ అందించింది లత. "అబ్బ! రాగానే ఒక నిమిషం ఖాళీగా వదిలివెయ్యరాదూ? అప్పుడే కాఫీ అంటూ విసిగించాలా?" మూర్తి గట్టిగా విసుక్కున్నాడు. అలసి వచ్చిన భర్తకు చిరునవ్వుతో కాఫీ అందిస్తే... స్వర్ణ ముఖం చిన్నబోయింది. అదేం పట్టించుకోకుండానే ఆమె తలలో విరజాజి పూలదండ చూస్తూ, తెచ్చిపెట్టుకున్న హాసంతో, "నా జీతం అంతా నీ పువ్వులకే చాలేట్టులేదే?" అన్నాడు మూర్తి, స్వర్ణ హృదయం ఎవరో నలిపి వేసినట్లయింది. తాను సరదాగా పూలు తీసుకరావడంపోగా ముచ్చటపడి కొనుక్కుంటే వచ్చిన ప్రతి ఫలం..!

పుచ్చ పువ్వులాంటి వెన్నెల. దశదిశలా వ్యాపిస్తున్న చల్లటి వెన్నెలను కిటికీలోంచి చూస్తూంది స్వర్ణలత. ఎనిమిది... తొమ్మిది... పది... గంటలు గడుస్తున్నాయి. పది గంటలకు క్లబ్బు నుండి వచ్చాడు మూర్తి. అంతవరకు నిర్లిప్తంగా ఉన్న స్వర్ణ ముఖంలో ఒక ఉత్సాహరేఖ మెరిసింది.

"ఈ వెన్నెల్లో అలా బయటికి వెళితే.." త్వరగా వెళ్లి తలుపు తీసింది. మూర్తి హడావిడిగా లోనికి వచ్చాడు. అతని వెనకాల నలుగురు స్నేహితులు! "త్వరగా అన్నం పెట్టు! వాళ్లు నాకోసం కాచుకున్నారు. అలా షైరు వెళ్లాలనుకున్నాం....!" నిలువునా నీరైపోతూ అన్నం వడ్డించింది స్వర్ణలత.

XXX

"చాలా జాలీగా గడిచి పోయాయనుకో ఈ వారం రోజులూ! ఇంట్లో ఉంటే ఎంత బోరు కొట్టేస్తుంది! అక్కడ అసలు టైము గడపడమే తెలియలేదు. ఎంత బావుందనీ బృందావన్ గార్డెన్స్! ఆ ఫౌంటెన్స్... ఆహా...!" మూర్తి ఉత్సాహంగా చెబుతున్నాడు. నిర్లిప్తంగా ఊ కొడుతూంది స్వర్ణ. "ఫ్యాను రోజూ వచ్చి పడుకున్నాడా ఈ వారంరోజులూ? ఏమిటో ఆలోచిస్తున్నావే?" మూర్తి సంభాషణ ముగిసింది. దానికీ ఊకొట్టింది స్వర్ణ! మూడుగదుల ఆ ఇంట్లో ముందు గదిలో మంచం మీద హాయిగా నిద్రపోతున్నాడు మూర్తి. ఉన్న ఒక్క కిటికీలోంచి బయటికి

చూస్తున్న స్వర్ణ కళ్లలో నీరు నిండింది. నిండు పూర్ణిమ, చంద్రుడు ఎంతో బావున్నాడు బయట... పలుచటి క్రాపు, సన్నగా, చిక్కని దవడలతో నిద్రపోతున్న మూర్తి.... వెన్నెల విహారాలు, బృందావన్ గార్డెన్స్, మనసున మనసుగా మసలే తోడు.... ఆకాశంలోకి చూసే తాను, పక్కన పొడుగ్గా బలంగా ఒక చేతిమీద కోటుతో ఉండే శేఖరం వంటి....... కలలు..... కలలు... ఊహలు మాధుర్యాలు కరిగిపోతున్నాయి. కాదు, పోయాయి! కలల వెన్నెలలో తేలిపోయే స్వర్ణలత కన్నె మనసనే పూల రథం నిజ జీవితమనే ఎండ వేడికి సొమ్మసిల్లి వాడిపోయింది!

ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక

తేది : 9-2-1966